క్లుప్తంగా

గణతంత్ర వేడుకలకు హాజరు కావాలి

బేస్తవారిపేట: మాజీ సైనికుల కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ ఉదయం 8 గంటలకు 74వ గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘ జిల్లా నాయకులు బొల్లా బాలిరెడ్డి, పి.వెంకటరాజు తెలిపారు. మాజీ సైనికుల కార్యాలయంలో జెండా ఆవిష్కరణ, అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో నివేశన స్థలాల కోసం అర్జీ అందచేయనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని మాజీ సైనికులు, సైనిక వితంతువులు, సైనికులు, సైనిక కుటుంబాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

తాళ్లూరు: రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. తూర్పుగంగవరం పరిధిలో సాగు చేసిన కాలిఫ్లవర్ పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. క్యాబేజీ, కాలీఫ్లవర్ తోటలను ఆయన పరిశీలించారు. సంవత్సరంలో మూడు పంటలు పండించుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేందుకు రైతులు నూతన పంటలు సాగు చెయ్యాలని కోరారు. వీఏఏ సుమ, కృష్ణారెడ్డి, శేషారత్నం పాల్గొన్నారు.

సహజసిద్ధ వనరులతో పంటలు సాగు చేయాలి

గిద్దలూరు రూరల్: రైతులు సహజసిద్ధ వనరులతో పంటలు సాగు చేయాలని వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని సంజీవరాయుడుపేటలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తూ వ్యవసాయం చేయాలన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి పలువురి సంతాపం



నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: వివిధ పత్రికల్లో విలేకరిగా పనిచేసి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందిన కంభంపాటి చిన శ్యామేలు కుటుంబ సభ్యులకు పలువురు సంతాపం తెలిపారు. ఆయన భౌతిక కాయాన్ని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, టీడీపీ వైద్యుల విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ సునీల్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మొఘల్ మస్తాన్‌వలి, కురిచేడు సొసైటీ ప్రెసిడెంట్ మర్రి సుబ్రహ్మణ్యం, జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏపీ అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగేశ్వరరావు, బ్రహ్మం, కె.సంతోష్‌లు సందర్శించి నివాళులర్పించారు. యూనియన్ తరపున నాగేశ్వరరావు, బ్రహ్మం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

పోలీసు అధికారులపై ప్రైవేట్ కేసు

మార్కాపురం: పోలీసుస్టేషన్‌కు పిలిపించి తనపై సీఐ, ఎస్‌ఐ దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదుపై మార్కాపురంలోని అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు కేసు నమోదు చేసింది. తర్లుపాడు మండలం లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన పెరికే పవన్ కుమార్‌పై ఆయన భార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ కోసం స్టేషన్‌కు పిలిపించిన ఎస్‌ఐ శశికుమార్ తీవ్రంగా కొట్టాడని, న్యాయం చేయాలని సీఐ భీమానాయక్‌ను కోరగా ఆయనా స్పందించలేదు. దీంతో పవన్‌కుమార్ మార్కాపురం కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. సీఐ, ఎస్‌ఐపై జడ్జి కేసు నమోదు చేశారు. ఏప్రిల్ 28న పోలీస్ అధికారులు ఇద్దరూ కోర్టుకు హాజరు కావాలని జడ్జి ఆదేశించారు.

చెన్నకేశవుని హుండీ ఆదాయం రూ.8.59 లక్షలు

మార్కాపురం టౌన్: శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించగా 8,59,789 రూపాయలు వచ్చినట్లు చైర్మన్ పి.కేశవరావు, ఈవో జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. నాలుగు నెలల ఆదాయం లెక్కించినట్లు పేర్కొన్నారు. ధర్మకర్త సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి

పుల్లలచెరువు: ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేయాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. కూలీలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పని చేస్తే రూ.257 కూలీ దక్కుతుందని పేర్కొన్నారు. ఉదయం 10 టల వరకు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు పనులు చేయాలన్నారు.

ఇళ్లకు కుళాయిలు ఇచ్చేందుకు సిద్ధం కావాలి

● ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న కన్వీనర్‌లు

దర్శి: ఇంటింటికీ కుళాయిలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, నగర పంచాయతీ అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ముండ్లమూరు మండలం సచివాలయం కన్వీనర్‌ల సమావేశం జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే మద్దిశెట్టి మాట్లాడుతూ పంపిన ఎస్టిమేషన్‌ల ప్రకారం దర్శిలో ఇంటింటికీ కుళాయిలు అందించేందుకు రూ.121 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఇది పూర్తిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనతేనని తెలిపారు. దర్శిలో నీటి సమస్య లేకుండా చేసేందుకు ఇంటింటికీ కుళాయిలు వస్తున్నాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. టెండర్లు పిలిచే లోగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఒక ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. పైపులైన్‌ల ఏర్పాటు, పట్టణంలో నీటి కుళాయిలు ఇవ్వాల్సిన తీరుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. ఎస్టిమేషన్‌ల ప్రకారం ఎన్ని కుటుంబాలకు నీరు ఇవ్వవచ్చు? ఎన్ని రోజుల్లో పని జరుగుతుందన్న విషయాల గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. అనంతరం నగర పంచాయతీ అభివృద్ధిపై, పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై నగర పంచాయతీ కమిషనర్ మహేష్‌తో చర్చించారు. పట్టణంలో ప్రధానంగా వేయాల్సిన సీసీ రోడ్లు, సైడ్ కాలువల గురించి చర్చించారు. అనంతరం ముండ్లమూరు మండలంలో నూతనంగా నియమితులైన సచివాలయాల కన్వీనర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కన్వీనర్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ మేడికొండ జయంతి, ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట తప్పని..మడమ తిప్పని నేత జగన్



మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: ప్రజా సంకల్ప యాత్ర పేరుతో చేపట్టిన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చి మాట తప్పని.. మడమ తిప్పని నేతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పొదిలి పట్టణం ఒకటో సచివాలయం పరిధిలో 1వ వార్డు రాజీవ్ నగర్, శ్రీపతి నగర్, రాం నగర్, ఆదాం నగర్, బుచ్చన్నపాలెం బీసీ కాలనీ ఏరియాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు వచ్చిన అధికారులు, నాయకులుకు స్థానికులు కల్లం సుబ్బారెడ్డి, యర్రం వెంకటరెడ్డి, కేఆర్‌సీ రెడ్డి, ఆదిరెడ్డి, వెంకటరెడ్డి, చెంచిరెడ్డిల ఆధ్వర్యంలో బాణసంచా కాల్చుతూ పూలతో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత ఎమ్మెలే గడప గడపకు వెళ్లి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాల అమలు తీరు అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కో కుటుంబానికి ఏ మేర లబ్ధి చేకూరిందో వివరించి బుక్‌లెట్ అందజేశారు. సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా, అర్హులై ఉండి పథకాలు అందని వారు ఎవరైనా ఉన్నారా.. అని ఎమ్మెల్యే కేపీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, మాజీ కన్వీనర్ జి.శ్రీనివాసులు, గూడూరి వినోద్, కె.సుబ్బారావు, కొత్తపులి బ్రహ్మరెడ్డి, మందలపు శ్రీనివాసరెడ్డి, ఫిరోజ్, జాకీర్, ఏబు, మందగిరి రమేష్, పేరం కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి మరింత చేయూత



పెద్దారవీడు : జాతీయ బాలికా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు, సూపర్‌వైజర్లు



బాలికా విద్యపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్ వాణి



తాళ్లూరు: ర్యాలీ చేస్తున్న అధికారులు, బాలికలు

తాళ్లూరు: బాలికల అభ్యున్నతికి ప్రభుత్వం మరింత చేయూత అందిస్తోందని, సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్య, వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కేవై కీర్తి తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా తాళ్లూరు కేజీబీవీలో మంగళవారం అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఎంఈఓ జి.సుబ్బయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌బీ మాట్లాడారు. ప్రిన్సిపాల్ సుజిత, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్, సూపర్‌వైజర్ జ్యోతి, సునీత, సీహెచ్‌ఓ ప్రమీల, హెచ్‌ఈఓ కొప్పోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు. వెలుగువారిపాలెం ఎంపీపీఎస్ (ఎస్సీ వీఆర్)లో ప్రధానోపాధ్యాయుడు పోలంరెడ్డి సుబ్బా రెడ్డి ఆధ్వర్యంలో బాలికాదినోత్సవం ఘనంగా నిర్వహించారు.

కురిచేడు: బాలికల అభివృద్ధికి విద్య, ఆరోగ్యం, ఉద్యోగం, సామాజికాభివృద్ధి అనేవి నాలుగు మూల స్తంభాలని ఎంపీడీఓ వట్టికూటి భవ్య పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఈఓ ఆర్. వస్త్రాంనాయక్ మాట్లాడుతూ స్త్రీ ఒక శక్తి లాగా అన్ని రంగాల్లో రాణించాలని, గొప్ప గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి, విలేజ్ పోలీస్ మస్తాన్‌బీ మాట్లాడారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

పుల్లలచెరువు: ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. స్వేచ్ఛనిద్దాం, సంరక్షిద్దాం అంటూ పలువురు ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం స్థానిక కేజీబీవి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. బాలికలకు హక్కులు, దిశ చట్టం ఆవశ్యకత గురించి వివరించారు. ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో బాలికల పాత్ర అధికంగా ఉందన్నారు. బాలికల పట్ల జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఎదుర్కొనేలా ఉండాలన్నారు. ప్రభుత్వం బాలికా విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు డిజిటల్ జనరేషన్ అవర్ జనరేషన్ అనే నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు

పెద్దారవీడు: బాలికలు తప్పనిసరిగా చదువుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మీదేవి, వి.సలోమి, ఎస్.అంజమ్మ సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ పిభే ఆధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ.. బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. స్త్రీలు హిం, అసమానతలకు గురికాకుండా ఉండాలంటే ఆత్మధైర్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పెద్దదోర్నాలలో గడప గడపకు కార్యక్రమం

పెద్దదోర్నాల: స్థానిక సచివాలయం–2 పరిధిలో బుధవారం రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి తెలిపారు. సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఆర్‌బీకేలను తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు



విఠలాపురం ఆర్‌బీకే సిబ్బందితో మాట్లాడుతున్న విజిలెన్స్ ఎస్పీ

తాళ్లూరు: మండలంలోని పలు ఆర్‌బీకేలను విజిలెన్స్ ఎస్పీ భూమన భవానీ హర్షరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. విఠలాపురం, ముండ్లమూరు ఆర్‌బీకేల్లో తనిఖీలు నిర్వహించి రైతులకు ఇస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర పథకాలపై ఆరా తీశారు. విఠలాపురంలో అందిస్తున్న యూరియా ధర, బయట ఫెర్టిలైజర్స్‌లో అందిస్తున్న యూరియా ధరకు పెద్ద వ్యత్యాసం లేదని, కనీసం 50 రూపాయలు ఉన్నా సరే ఆబీకేల్లోనే కొనుగోలు చేస్తామని రైతులు తెలిపారు. డీసీటీఓ రామారావు, అసిస్టెంట్ జియాలజిస్ట్ సుధాకర్, విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విజేతలతో ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

గిద్దలూరు రూరల్: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. గిద్దలూరు క్లబ్ రోడ్డులోని టెన్నిస్ కోర్టులో జరిగిన జిల్లా స్థాయి టెన్నిస్ లీగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం రాత్రి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ రంగారెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ భూలక్ష్మి

తర్లుపాడు: ఇగ్నైట్ యంగ్ మైండ్స్ కార్యక్రమంలో భాగంగా తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, సర్పంచ్ వరాలు, వైస్ సర్పంచ్ వెన్నా సత్యనారాయణరెడ్డి, రాగసముద్రం సర్పంచ్ రమణారెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేయాలి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టులో భాగంగా ముంపునకు గురవుతున్న గొట్టిపడియ గ్రామ రైతులకు నష్టపరిహారం పంపిణీలో న్యాయం చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గొట్టిపడియ గ్రామ నిర్వాసితులు, ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ సరళ వందనంతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సొంత గ్రామాన్ని, పొలాలు, ఇళ్లను త్యాగం చేసి ప్రాజెక్టు నిర్మాణం కోసం బయటకు వస్తున్నారని, వీరందరికీ నష్టపరిహారం, ఆర్‌ఆర్ ప్యాకేజీ అందేలా చూడాలని కోరారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, తుమ్మా వెంకటరెడ్డి, వేల్పుల చెన్నారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కొంతమంది పేర్లు నష్టపరిహారం జాబితాలో లేవంటూ ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తెచ్చారు. తన పరిధిలో ఉన్న వారికి రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తానని స్పెషల్ కలెక్టర్ భరోసా ఇచ్చారు. మరికొన్ని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ తాను కూడా నిర్వాసితుల సమస్యలను కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. ప్రాజెక్టు అధికారులతో పాటు కాశిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

ముండ్లమూరు: పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పసుపుగల్లులో రెండో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా నవరత్నాల పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పలువురు రైతులు భూసమస్యలు తీసుకురావడంతో తహసీల్దార్ ఉషారాణితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలుత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, మండల సచివాలయాల కో ఆర్డినేటర్ మేడికొండ జయంతి, వైఎస్సార్ సీపీ నాయకులు బిజ్జం సుబ్బారెడ్డి, అన్నపురెడ్డి భిక్షాలురెడ్డి, మదుల్లా సుబ్బారెడ్డి, జిల్లెల్లమూడి శివయ్య, అంబటి వెంకటేశ్వరరెడ్డి, భద్రి సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు వరగాని బాలసుందరరావు, వేములు పద్మావతి శ్రీనివాసరావు, జనమాల నాగేంద్రం, పిచ్చయ్య, ఓగుల్లూరి రామాంజి, జమ్ములు గురవయ్య, ఎంపీటీసీ దాసరి పెద అంజయ్య, గర్నెపూడి ప్రసన్నకుమార్, జాన్ పాల్గొన్నారు.

సౌకర్యవంత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎం సుందరరావు

పొదిలి రూరల్: ప్రయాణికులకు మెరుగైన, సౌకర్యవంత ప్రయాణమే ఆర్టీసీ లక్ష్యమని డీఎం సుందరరావు అన్నారు. మంగళవారం పొదిలి ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు డిజిటల్ పేమెంట్ స్టిక్కర్స్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ మరో కొత్త సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఇప్పటికే టికెట్ల రిజర్వేషన్లు, ఇతర ఆర్థిక కార్యకలాపాల్లో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తూ ఇప్పుడు ఒక అడుగు ముందుకేసి ప్రయాణంలో చిల్లర సమస్యకు చెక్ పెట్టిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత సేవలకు శ్రీకారం చుట్టింది. పొదిలి డిపోలో 67 బస్సులు ఉన్నాయని, అన్ని బస్సుల్లో ఫోన్‌పే, గూగుల్‌పే, ఏటీఎం కార్డు, క్యూఆర్ కోడ్ వంటి వాటితో టిక్కెట్ చార్జీలు చెల్లించవచ్చన్నారు. టిమ్ మిషన్‌పై క్యూఆర్ కోడ్ ఉంటుందని, ఆ కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపులు చేసి టికెట్ పొందొచ్చన్నారు. ఎస్టీఐ ధనలక్ష్మి, టీఐలు వలి,షరీఫా, శేషయ్య పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పని చేయాలి



ఎస్‌ఐ దీపికతో మహిళా పోలీసులు

కొనకనమిట్ల: గ్రామ సచివాలయాల్లో పని చేసే మహిళా పోలీసులు గ్రామ వార్డు, పోలీసుస్టేషన్‌లకు అనుసంధాన కర్తలుగా ఉండి క్షేత్రస్థాయిలో పని చేసి మంచిపేరు తీసుకరావాలని ఎస్‌ఐ దీపిక ఆకాంక్షించారు. మంగళవారం గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్పీ మలికా గర్గ్ మహిళా పోలీసుల సేవలు గుర్తిస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో అన్నీ సమస్యలు, పరిస్థితులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలపై స్పందించి స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మహిళా పోలీసులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఎస్‌ఐ దీపికకు పూల మొక్క అందజేసి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్‌ఐ హసన్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కంభం: ప్రశంసలు విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని ప్రేరేపిస్తాయని మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి అన్నారు. మంగళవారం నెహ్రూనగర్‌లోని శ్రీ శ్రీనివాస ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. డ్రాపౌట్ రిజిస్టర్ పాఠశాలల్లో తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు బాలలింగయ్య,శ్రీదేవి పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ



బీరువాలో చెల్లాచెదురుగా పడి ఉన్న చీరలు

మార్కాపురం టౌన్: తాళం వేసిన రెండు ఇళ్లను టార్గెట్‌గా చేసుకున్న దొంగలు సోమవారం రాత్రి కంభం రోడ్డులోని శ్రీనివాస థియేటర్ పక్క సందులో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలు మంగళవారం వెలుగులోకి వచ్చాయి. బంధువుల ఇంటికి వెళ్లిన కురిచేటి సుజాత ఇంటి బీరువా తాళాలు పగులగొట్టి రూ.3 వేల నగదు, రెండు పట్టుచీరలు, మారంరెడ్డి సరస్వతి ఇంట్లో రూ.10 వేల నగదు చోరీకి పాల్పడినట్లు బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌ను స్పెషలాఫీసర్ పరమేశ్వరరావు అధికారులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల రికార్డులు తనిఖీ చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ సెంటర్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్పెషలాఫీసర్‌కు తెలియజేశారు. స్పందించిన ఆయన సూపర్‌వైజర్‌తో మాట్లాడి వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ నరసింహులు, ఎంఈవో సుజాత, ఏపీఎం పిచ్చయ్య పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం



రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

దొనకొండ: స్థానిక వీవీపురంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం ఉండటంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అదే వీధిలో పోలేరమ్మ దేవస్థానం ఉండటంతో భక్తులు నిత్యం అమ్మవారి దర్శనానికి వెళ్తుంటారు. ఈ మధ్య కాలంలో దాతల సహకారంతో గుడిని అభివృద్ధి చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు విద్యుత్ స్తంభం వద్ద ఆగాల్సి వస్తోంది. ప్రయాణికులు అక్కడి నుంచి నడిచి వెళ్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.


రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ జైనులుద్దీన్

పొదిలి రూరల్: రైతులు తప్పని సరిగా తమ పంటలకు ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి జైన్‌లుద్దీన్ సూచించారు. మంగళవారం పొదిలి మండలం ఏలూరు, తలమళ్ల, ఉప్పలపాడు గ్రామాల్లో సాగు చేసిన వరి పైరును ఆయన పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో మాట్లాడారు. మండలంలో 3,321 మంది రైతులు 9,132 ఎకరాల్లో పలు పంటలు సాగు చేశారన్నారు. బొబ్బర్లు 5,782 ఎకరాలు, పొగాకు 1,340 ఎకరాలు, మినుము 1,017 ఎకరాల్లో సాగు చేశారన్నారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతూ ఆర్బీకేల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ స్థలం కబ్జా



అక్రమంగా నిర్మించిన కట్టడం వద్ద స్థానికుడు మోహన్‌రావు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని మోహన్‌రావు సప్లయర్స్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెకు సంబంధించిన స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా కట్టడం నిర్మించారంటూ స్థానికులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే ఎర్త్ తీగలను భూమిలోకి ఉంచిన రాడ్‌ను పూడ్చిచేసి మరీ అక్రమంగా నిర్మించినా అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయమై నగర పంచాయతీ అధికారులు, విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికుడు మోహన్‌రావు తెలియజేశాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను కాలువపై ఉంచారని, కాలువ నుంచి తొలగించి ఆ స్థలంలోకి మార్చాలని కోరారు.

గిద్దలూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రమాదేవి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎం.రాజారమేష్ ప్రేమ్‌కుమార్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది వెళ్లిన సందర్భంగా ఆయన స్థానంలో కొమరోలు తహసీల్దార్ రమాదేవిని గిద్దలూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రభుత్వం నియమించింది. ఆ మేరకు ఆమె మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమెను డిప్యూటీ కలెక్టర్ రాజారమేష్ ప్రేమ్‌కుమార్, డీటీ ప్రసాదరావు, రెవెన్యూ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.